క్లుప్తంగా

సీఎం సభకు భారీగా తరలిన రైతులు

తెనాలి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు మండల గ్రామాల నుంచి మంగళవారం రైతులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని 18 గ్రామాల నుంచి 110 బస్సుల్లో రైతులు మహిళలు తరలివెళ్లగా ట్రాక్టర్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ల ద్వారా మరి కొంత మంది యువకులు వెళ్లారు. మండల పరిషత్ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాస రావు పర్యవేక్షణలో ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు ఆధ్వర్యంలో బహిరంగ సభకు వెళ్లారు. కొలకలూరులో బహిరంగ సభకు వెళ్ళే బస్సులను ప్రసాదం బాలగుర వమ్మ, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణికుమార్, నాగదేవిక, చక్కా సీతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. నందివెలుగులో గ్రామ సర్పంచి ధూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులు, యువకులు, మహిళలు బహిరంగ సభకు వెళ్లారు.

ప్రధాన అయ్యప్ప ఆలయంలో కుంకుమపూజలు



తెనాలి టౌన్: బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్పస్వామి ఆలయంలో అష్టమి దుర్గమ్మ సన్నిధానంలో దుర్గమ్మ తిరునాళ్లు సందర్భంగా మంగళవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. గత నెల 24 నుంచి ప్రధాన అర్చకులు దుర్భ హరిబాబు శాస్త్రి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. ఆది, సోమవారాల్లో పసుపు గౌరి అమ్మవారిని గడప గడపకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నృసింహునికి ఛత్రాల బహూకరణ



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుంటూరుకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త, సమాజ సేవకులు ఆకుల ఏడుకొండలు, శరత్ చంద్ర, విజయ్ కీర్తిలు మంగళవారం సుమారు రూ.30వేల విలువైన ఛత్రాలను బహూకరించారు. ఆ మేరకు మంగళవారం ఆలయ ఈఓ రామకోటిరెడ్డికి ఛత్రాలను అందజేశారు.

తబల విద్వాంసులు శ్రీనివాసరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం సతీఅనసూయ చిత్రాన్ని ప్రదర్శించారు. బుధవారం కోడలుదిద్దినకాపురం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం తబల విద్వాంసులు కేమిశెట్టి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెట్టి శ్రీనాథ్, లక్కరాజు లక్ష్మణరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, కాకుమాను రామారావు, శాఖమూరి మల్లిఖార్జునరావు, కామిశెట్టి రవీంద్రకుమార్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్‌టీఆర్ జగన్, గుమ్మడి ప్రసాద్, మహేష్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మార్చి 2న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డయాబెటాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వలైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో ఒక్కో రోగికి సుమారు రూ.10 వేల ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్ ఉచితంగా చేస్తున్నామన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు ముందుగా 8341713713, 9854757999 సంప్రదించాలన్నారు.

ధర్మమే సృష్టికి ఆధారం

పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికపై సుందర సత్సంగ్, ఆలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విష్ణు సహస్రనామంపై సుందరచైతన్యానంద స్వామి శిష్యుడు కేవీ కోటేశ్వరరావు ప్రవచనం చేశారు. పరమాత్మ సర్వజగత్తును సృష్టించి ధర్మం ప్రతిష్ఠ చేశారని, లోకంలోని జనులు ధర్మాత్ములనే ఆశ్రయిస్తున్నారన్నారు.

ఉప్పొంగిన అభిమానం

అభిమానం ఉప్పొంగింది. అశేష జనం తరలివచ్చింది. వేకువజాము నుంచే రైతులు, అభిమానులు భారీగా మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అడుగడుగునా జగనన్న నినాదాలతో తెనాలి పట్టణం హోరెత్తింది. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు చూసేందుకు పోటీపడ్డారు. అక్కడ నుంచి బస్సులో వచ్చిన సీఎంకు అభిమాన పూలవర్షం కురిపించారు. రైతు బాంధవుడు సీఎం జగన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. సభా ప్రాంగణం చేరుకోగానే రైతులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు.

–తెనాలి/సాక్షి ఫొటోగ్రాఫర్



వ్యవసాయ శాఖ అందజేసిన యంత్ర పరికరాల లబ్ధి పొందిన రైతుతో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు భరోసా సాయం పంపిణీ సందర్భంగా నిర్వహించిన సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రైతు బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సీత, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తదితరులు



నవరత్న రూపశిల్పి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి నియోజకవర్గ నాయకుల తరఫున జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్

నృసింహునికి ప్రత్యేక పూజలు



నృసింహుని గ్రామోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఆళ్ల , ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆళ్ల

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి వారిని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. నృసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి గ్రామోత్సవంలో వారు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంజినీరింగ్ అధికారులపై కౌన్సిల్ ఆగ్రహం

- నిర్లక్ష్యంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల నిలదీత
- పనులు చేయలేకపోతే ట్రాన్స్‌ఫర్‌లు చేయించుకోవాలని చైర్‌పర్సన్ సూచన



అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు (ఇన్‌సెట్) సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి అర్బన్: 'ఇంజినీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా ఉంది. ఎన్నిసార్లు చెప్పిన మార్పు రావడం లేదు. కౌన్సిలర్లు చేస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడంలో కూడా జాప్యం చేస్తున్నారు. తాము చెప్పిన పనులు చేయలేనప్పుడు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోవాలి' అని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. తెనాలి మున్సిపల్ కౌన్సిలర్ సాధారణ సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. అజెండాలోని 30 అంశాలు చదవడం పూర్తి చేయగానే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య లేచి ఆదిత్య సంస్థ వారికి రక్షిత తాగునీటి పైప్ లైన్ పనులు అప్పగించడం వలన వారు సకాలంలో వాటిని పూర్తి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైపు లైన్ కోసం గుంతలు తవ్వి వదిలేస్తున్నారని, దీనివలన ప్రజలు ప్రమాదాల బారినపడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి కాంట్రాక్టర్‌లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంతలో అత్తోట నాగవేణి, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ ఇస్మాయేలు, మొగల్ అహ్మద్ బేగ్ తమ వార్డులలో కూడా వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిన పనులు మాత్రం ప్రారంభం కావడం లేదని ఆరోపించారు. పనులు చేయని కాంట్రాక్టర్‌లపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఇంజినీరింగ్ అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇంజినీరింగ్ విభాగంపై ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని, అధికారులు ఎందుకు తమ ప్రవర్తనను మార్చుకోవడం లేదని చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వలన వార్డులోని ప్రజలు కౌన్సిలర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దేసు యుగంధర్ అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులోనే ఇంత దారుణంగా తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వార్డులలో కూడా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా అధికారులు ప్రారంభించలేదని ఆరోపించారు. అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కంటతడిపెట్టిన ఎంఈ నాగమల్లేశ్వరరావు

ఇంజినీరింగ్ విభాగం పనితీరుకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నాని మున్సిపల్ ఇంజినీర్ కొడాలి నాగమల్లేశ్వరరావు తెలిపారు. తాను లాంగ్ లీవ్‌లో వెళ్లిపోతానంటూ కంటతడి పెట్టారు. కమిషనర్ జశ్వంతరావు కల్పించుకుని కౌన్సిలర్లు చెప్పిన ప్రతి సమస్యను నోట్ చేసుకున్నామని, ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి అన్ని వార్డుల్లో అసంపూర్తిగా, ప్రారంభంకానీ పనులను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన నమూనాలతో విద్యార్థులు

మున్నంగి(కొల్లిపర): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయని వి.దీపలత అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పడవ తయారీ, ప్రొజెక్టర్, అగ్ని పర్వతం, రకరకాల ఇళ్ల నమూనాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాము పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూల్‌లో సైన్స్ దినోత్సవం

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గత నెల 25, 26 తేదీలలో స్కూల్‌లో విద్యార్థులతో తయారు చేయబడిన ప్రాజెక్ట్‌లు, ఇతర విద్యార్థులు రాసిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే బహుమతులు అందజేశారు. ఆరో తరగతి విద్యార్థిని డి.వర్షశ్రీకి ప్రథమ బహుమతి కింద రూ.రెండు వేలు, ఎనిమిదో తరగతి విద్యార్థిని నవ్యశ్రీకి ద్వితీయ బహుమతి కింద రూ.1500, పదో తరగతి విద్యార్థి రూపాస్ పాల్‌కు తృతీయ బహుమతి రూ.1000 నగదును అందజేశారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- కారు డ్రైవర్‌ను తప్పించారనే విమర్శలు



బోల్తా కొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

మంగళగిరి: నగర పరిధిలోని తెనాలి ఫ్లెవర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి కాజ టోల్‌గేట్ వద్ద ఖలీల్ భాయ్ హోటల్‌కు వెళుతున్న హోటల్ యజమాని కుమారుడు కారును అత్యంత వేగంగా నడిపి ముందు వెళుతున్న ఒక గూడ్స్ ఆటోను ఢీకొట్టాడు. కారు రోడ్డుపై బోల్తా కొట్టగా గూడ్స్ ఆటోతోపాటు మరో రెండు ద్విచక్ర వాహనాలను సైతం ఢీకొట్టింది. విజయవాడకు చెందిన గూడ్స్ ఆటో డ్రైవర్ బాదుల్లా కుర్‌కురే ప్యాకెట్ల లోడుతో పాన్నూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారును అత్యంత వేగంగా నడిపిన హోటల్ యజమాని కుమారుడు కారులో భారీగా నగదు ఉండటంతో దిగి నగదు బ్యాగుతో మరో ఆటోలో ఎక్కి పారిపోయినట్లు తెలిపారు. బాదుల్లాకు తీవ్ర గాయాలు కాగా ద్విచక్ర వాహనదారులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించేటప్పటికే కారు డ్రైవర్ పారిపోగా స్వల్ప గాయాలైన ఇరువురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలైన బాదుల్లాను ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కారు డ్రైవర్‌తోపాటు క్షతగాత్రులైన ఇరువురి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శరవేగంగా నిడమర్రు రోడ్డు విస్తరణ

- కొనసాగుతున్న పడమర బైపాస్ పనులు
- సీఆర్‌డీఏ గ్రామాలకు మహర్దశ
- త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన ఎమ్మెల్యే ఆర్కే



శరవేగంగా కొనసాగుతున్న నిడమర్రు రోడ్డు విస్తరణ పనులు

మంగళగిరి: నిడమర్రు రోడ్డు విస్తరణతోపాటు పలు రోడ్ల నిర్మాణాలు, పడమర బైపాస్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోడ్ల విస్తరణ పనులు, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సీఆర్‌డీఏ గ్రామాల పరిధిలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణాలతో ఆయా గ్రామాలకు మహర్దశ పట్టనుంది. నిడమర్రు తాడికొండ రోడ్డు రూ.25.14 కోట్లతో నిర్మాణం చేపట్టగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మంగళగిరి రైల్వే గేటు నుంచి ప్రారంభమయ్యే రోడ్డు నిడమర్రు, కురగల్లు, నీరుకొండల మీదుగా పెదపరిమి వరకు 23 కిలోమీటర్లు విస్తరించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. రోడ్డు విస్తరణతో ఆయా గ్రామాలతో పక్క గ్రామాల వారు మంగళగిరి పట్టణం నుంచి సచివాలయంతోపాటు తాడికొండ, అమరావతికి ప్రయాణం చేసే వారికి అన్ని రకాల ఉపయోకరంగా ఉంటుంది. నీరుకొండలో కల ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి, కురగల్లులోని అమృత యూనివర్సిటీలకు వెళ్లే విద్యార్థులకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగకంగా ఉంటాయి. మరో వైపు చినకాకాని నుంచి మంగళగిరి, నిడమర్రు, నవులూరు, వెంకటపాలెం గ్రామాల మీదుగా కృష్ణా జిల్లా గొల్లపూడి వద్ద జాతీయరహదారిని కలుపుతూ నిర్మాణం జరుపుకుంటున్న పడమర బైపాస్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పడమర బైపాస్ నిర్మాణం కోసం నిడమర్రు రోడ్డుపై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు పూర్తి కావస్తున్నాయి. కృష్ణానదిపై వంతెన నిర్మాణం ద్వారా గొల్లపూడి వద్ద హైవేకు కలిపి అక్కడ నుంచి ఏలూరు అవతల పూండ్ల వరకు బైపాస్ నిర్మాణం జరుగుతుంది. నిడమర్రు రోడ్డు విస్తరణ, పడమర బైపాస్ రోడ్ల నిర్మాణంతో సీఆర్‌డీఏ గ్రామాలకు మహర్దశ పట్టనుందనడంతో సందేహం లేదు. మరో వైపు నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు చివర దశకు చేరుకోగా ఇప్పటికే రంజీ మ్యాచ్‌లు, ఇంటర్నల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మరికొద్ది రోజులలో స్టేడియం నిర్మాణం పూర్తిచేసి ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. అభివృద్ధికి అడ్డంకిగా మారిన రైల్వేగేటు అనుకుని ఉన్న డంపింగ్ యార్డును సైతం తరలిస్తుండగా ఇప్పటికే సగానికి పైగా చెత్తను అక్కడ నుంచి తొలగించారు.

ఊపందుకున్న భూముల క్రయవిక్రయాలు

సీఆర్‌డీఏ పరిధిలో గత కొద్ది రోజులుగా భూముల క్రయవిక్రయాలు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికంగా పడమర బైపాస్ రోడ్డు అనుకుని అధికంగా క్రయవిక్రయాలు జరుగుతుండగా, సీఆర్‌డీఏ గ్రామాలలో ధరలు పుంజుకోవడంతో క్రయవిక్రయాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే సీఆర్‌డీఏ గ్రామాలు మరింత అభివృద్ధి బాట పట్టనున్నాయడంలో సందేహం లేదు.

శ్మశాన వాటిక లేక ఇబ్బందులు

తూములూరు(కొల్లిపర): గ్రామంలో తొగటవీర క్షత్రియులులకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పానిశెట్టి జ్ఞానమ్మ(70) మంగళవారం మృతి చెందింది. దీంతో శ్మశాన వాటిక లేకపోవడంతో ఫిరంగిపురం బంధువుల ఇంటి వద్ద అంత్యక్రియలు నిర్వహించేందుకు తరలించారు. శ్మశాన వాటిక ఏర్పాటు చేసి వంద కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తొగటవీర క్షత్రియులు పంచాయతీ కార్యాలయంలో విన్నవించారు.

రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు 2వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2న విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. 3న శేషవాహన సేవ, ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్ఠా మహోత్సవం, ద్వారపాలక, గరుడాళ్వార్, ఆంజనేయ శిలా విగ్రహ ప్రతిష్ఠ, 4న హనుమత్ వాహనసేవ, 5న గజవాహన సేవ స్వామివారి ఊరేగింపు విశేషంగా జరుగుతాయని అన్నారు. కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు పద్మావతి కళావేదికపై పారాయణాలు, తాళం భజనలు, సువాసినిపూజ, చండీహోమం, 7న అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మాధవస్వామి, ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సంయుక్త కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకుని నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో సైన్స్ దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక మోడల్స్‌ను ప్రదర్శించారు.